క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్



మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటరావు శనివారం దర్శించుకున్నారు. తొలుత స్వామి వారిని దర్శించుకున్న ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారికి పూజలు చేసి వెంకటరావుకు తీర్థ ప్రసాదాన్ని, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యుడు నందకిశోర్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహం



అవనిగడ్డ: స్థానిక ఎస్వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. పాలమూరుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణరావు, కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో మెరిట్ మార్కులు సాధించిన తక్కెళ్ల తేజస్విని, పి.భావనకు రూ.4 వేలు చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు. అనంతరం మెరిట్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయానికి తహసీల్దార్ ఎల్వీఎస్ రామకృష్ణ.. గ్రూప్–2 అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు అందించారు. గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ గ్రంథాలయ అధికారి జె.ప్రభుదాస్‌కు పుస్తకాలు అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదివి గ్రూప్–2 ఉద్యోగం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌పై శిక్షణ



పెడన: పట్టణంలోని వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అడ్మిన్లు, గ్రామ సచివాలయాల్లోని గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు జాయింట్ రిజిస్ట్రార్లుగా వ్యవహరించాలని పెడన సబ్ రిజిస్ట్రార్ ఆర్ఆర్ శేఖర్ అన్నారు. ఆయన పట్టణంలోని ఐదో సచివాలయాన్ని శనివారం సందర్శించి పేదలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి అక్కడి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఆన్‌లైన్ సాంకేతిక ఇబ్బందుల కారణంగా పట్టణంలో ఇంకా రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవ్వలేదని, రాత్రికి అయ్యే అవకాశాలున్నాయని సబ్‌రిజిస్ట్రార్ తెలిపారు. ఆయనతో పాటు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, సర్వే కార్యదర్శి జితేంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బోడగుంట(మోపిదేవి): బోడగుంట గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ ఏసుపాదం(40) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్‌నాయుడు రూ.6,500ను మృతుని భార్య భాగ్యలక్ష్మికి అందజేశారు. శనివారం ఉదయం వారి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట తేళ్ల బాబు, కొమ్ము లాభాను, పిండి వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ నాగభూషణం, శ్రీనివాసరావు, రాణి, కొదము చిన్నారి, కొక్కిలిగడ్డ సువర్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్టేడియానికి స్థల పరిశీలన

పామర్రు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పామర్రు నియోజకవర్గానికి స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు శనివారం స్థల పరిశీలన చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్లు వినయ్ ప్రసాద్, కృష్ణకుమార్, మాథ్యూ అబ్రహం, రవిశర్మ సభ్యులతో కూడిన ఫెజిబుల్ కమిటీ సభ్యులు పామర్రులోని పలు ప్రదేశాలను స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.

సొంత భవనాల్లో ప్రభుత్వ సేవలు

పూర్తయిన సచివాలయాలు, ఆర్‌బీకే భవన నిర్మాణం



కోడూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కోడూరు–1 సచివాలయం, రైతుభరోసా కేంద్రం

కోడూరు: ప్రభుత్వ సేవలను సొంత భవనాల్లో అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా సచివాలయాలు, ఆర్‌బీకేల భవన నిర్మాణాలను ప్రారంభించారు. ఇవి తుది దశకు చేరుకున్నాయి. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన సచివాలయ వ్యవస్థ పూర్తిస్థాయి నిర్వహణకు భవనాలు 'సిద్ధం' అయ్యాయి. కోడూరు మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి జనాభా ప్రతిపాదికన 11 సచివాలయాలుగా విభజించారు. ఇప్పటి వరకు 11 సచివాలయాలను పంచాయతీ కార్యాలయాలు, పలు ప్రభుత్వ భవనాల్లో కొనసాగించి ప్రజలకు అవసరమైన సేవలను అందించారు.

నూతన భవనాలు

ప్రస్తుతం సచివాలయ వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తూ గ్రామాల్లో నూతన భవనాలు రూపుదిద్దుకున్నాయి. ఎనిమిది సచివాలయాల నిర్మాణాలను అధికారులు ప్రారంభించి, ప్రస్తుతం వాటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. కోడూరు–1, మందపాకల, పిట్టల్లంక, సాలెంపాలెం సచివాలయాల పనులు వంద శాతం పూర్తయ్యాయి. కోడూరు–2, కోడూరు–3 సచివాలయ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వి.కొత్తపాలెం, లింగారెడ్డిపాలెం సచివాలయాల నిర్మాణ పనులు వేగంగా సాగుతుండగా, ఈ నెలాఖరు నాటికి వీటిని పూర్తి చేయడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. వీటితో పాటు కోడూరు–1, మందపాకల సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) నిర్మాణాలు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

గ్రామాల్లో నూతన శోభ..

సచివాలయం, ఆర్‌బీకే భవన నిర్మాణాలు పూర్తి కావడంతో గ్రామాల్లో నూతన శోభ సంతరించుకుంది. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.43.6 లక్షలు, ఆర్‌బీకే భవనాన్ని రూ.23.14 లక్షలతో నిర్మించారు. ఎనిమిది సచివాలయాలను రూ.3.49కోట్లుతో నిర్మించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేసింది. కోడూరు–1 సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాలు తహసీల్దార్, మండల పరిషత్, ఎమ్మార్సీ, ఉపాధి హామీ, విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాలకు అతి సమీపంలో నిర్మించారు. ఈ సచివాలయాలనికి వచ్చే ప్రజలకు అన్ని సేవలు ఒకే చోట అందనున్నాయి.

త్వరలో భవనాలు ప్రారంభం

సచివాలయం, ఆర్‌బీకే భవనాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. ఈ కార్యాలయాల్లో అన్ని సౌకర్యాలను కల్పించారు. ఉద్యోగులు శాఖాపరంగా సేవలందించేందుకు క్యాబిన్లు ఏర్పాటుతో పాటు ఫిర్యాదులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను కూడా భవనంలో నిర్మించారు. ఆర్‌బీకేల్లో రైతులకు సేవలందించడానికి అత్యాధునిక పరికరాలు, ఎరువులు, పురుగు మందుల నిల్వకు గదులను నిర్మించారు.

ప్రజలకు మెరుగైన సేవలు



మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారు. గ్రామాల్లోనే సచివాలయాలు, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో నిర్మిస్తున్న సచివాలయాలు, ఆర్‌బీకే భవనాల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. భవనాల్లో ఉద్యోగులతో పాటు వచ్చే ప్రజలకు కూడా వసతులు కల్పించారు. ఈ భవన నిర్మాణాలతో గ్రామాలు నూతన శోభ సంతరించుకున్నాయి. –కొండవీటి వెంకటకుమారి, ఎంపీపీ, కోడూరు

తుది దశకు చేరుకున్న భవన నిర్మాణాలు



మండలంలో సచివాలయ భవన నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. కోడూరు–1, మందపాకల, పిట్టల్లంక, సాలెంపాలెం సచివాలయ భవనాల పనులు నూరు శాతం పూర్తయ్యాయి. కోడూరు–2,3, వి.కొత్తపాలెం, లింగారెడ్డిపాలెంలో సచివాలయ భవనాల పనులు చివరిదశకు చేరాయి. ఆర్‌బీకేల నిర్మాణాలు కూడా తుదిదశకు చేరుకున్నాయి. త్వరలో వీటిని ప్రారంభిస్తాం. – శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కోడూరు

సిద్ధం సభకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



మచిలీపట్నంలో సిద్ధం సభకు బయలుదేరుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



మోపిదేవిలో వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



సభకు బయలుదేరుతున్న మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు



ఆకులమన్నాడు నుంచి బయలుదేరుతున్న నేతలు, కార్యకర్తలు

అవనిగడ్డ: ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ 'సిద్ధం'కు అవనిగడ్డ నియోజకవర్గం నుంచి భారీగా తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి శనివారం నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మోపిదేవిలో వాహనాలను జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఆరు మండలాల పార్టీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

కోడూరు: మండలంలోని 13 పంచాయతీల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులు, కార్లు, ఆటల్లో సభకు వెళ్లారు. జెడ్పీటీసీ దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు తదితరులు వెళ్లారు.

మచిలీపట్నంటౌన్: సిద్ధం సభకు మచిలీపట్నం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలపై వేలాది మంది స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే పేర్ని నాని కార్యకర్తలతో కలిసి బస్సులో ప్రయాణించారు నగరంలోని 43వ డివిజన్‌లో కార్యకర్తలతో కూడిన బస్సును పేర్ని కిట్టు జెండా ఊపి పంపించారు. ఈ బస్సుల్లో పేర్ని కిట్టుతో పాటు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ బొర్రా విఠల్, నాయకులు, కార్యకర్తలు ప్రయాణించారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ సింహాద్రి రమేష్‌బాబు మచిలీపట్నం నుంచి బస్సులో బయలుదేరిన కార్యకర్తలను కలిసి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

పెడన: వైఎస్సార్ సీపీ పెడన కార్యాలయం వద్ద సిద్ధం కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో నిండిన బస్సులను ఆ పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులు ఇద్దరూ కలిసి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు.

బంటుమిల్లి: పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము) సారథ్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, ఎంపీపీ వి. చినబాబు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు తదితరులు వెళ్లారు

గూడూరు: గూడూరులో ఎంపీపీ సంగా మధుసూదనరావు, పార్టీ మండల అధ్యక్షుడు పర్లం పెదబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటేపల్లి రత్నారావు, జిల్లా ప్రచార కార్యదర్శి గొరిపర్తి రవికుమార్, ఏపీఎస్ఎఫ్‌సి డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, ఆర్బీకే చైర్మన్ ఫైజుల్ రహ్మాన్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఉత్సాహంగా బస్సుల్లో వెళ్లారు

చల్లపల్లి: వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ(నాని) ఆధ్వర్యాన నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెడన: మండలంలోని బలిపర్రులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినిల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. రూతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్//ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ ద్వారా ఆసక్తిగల విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి పదో తేదీ ఉదయం పది నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి వారికి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావునగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరదలచిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైడిపాముల అరుణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నగరంలో 97.34 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో శనివారం 97.34 శాతం పూర్తైంది. నగరంలో 19,259 మంది పింఛనర్లు ఉండగా వీరిలో 18,746 మందికి పింఛన్లు అందజేశారు. ఇంకా 513 మందికి ఇవ్వాల్సి ఉంది. పింఛన్ల పంపిణీల్లో నగరపాలక సంస్థ జిల్లాలో ఐదో స్థానంలో నిలిచింది.

తహసీల్దార్‌కు సత్కారం

గూడూరు: గూడూరు తహసీల్దార్‌గా పని చేస్తూ ఇటీవల బదిలీల్లో కాకినాడ రూరల్‌కు బదిలీపై వెళ్లిన బూసి విజయప్రసాద్‌ను స్థానిక రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సభలో గూడూరు తహసీల్దార్‌గా విజయప్రసాద్ అందించిన సేవలను సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వై.శివశంకర్, మండల సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ నస్రీన్ ఆరా, వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్

చల్లపల్లి: హమ్మింగ్ బర్డ్ ఢిల్లీ వారు నిర్వహించిన ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో స్థానిక ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని దోనే పల్లవి బంగారు పతకం సాధించింది. ఎనిమిదో తరగతి విద్యార్థులు సీహెచ్ హేమశ్రీ, మోహనకృష్ణ, 9వ తరగతి విద్యార్థిని అద్దంకి వీర రాజేశ్వరి మెరిట్ రెండో స్థానం పొందారు. వీరితో పాటు కుంచే కావ్య, నమ్రత ఈఈఎంటీ ప్రిలిమ్స్ పరీక్ష రాసి మెయిన్స్‌కు అర్హత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన టీఆర్‌వీఎల్‌వీ ప్రసాద్‌ను హైస్కూల్ హెచ్ఎం శిర్విశెట్టి సుదర్శన ప్రసాద్ అభినందించారు.

మండలాభివృద్ధికి కృషి

పమిడిముక్కల: ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎంపీపీ కాసాని వేదసుప్రజ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు వేయాలని వైద్య, విద్యాశాఖలకు సూచించారు. సమావేశానికి హాజరు కాని శాఖలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రబీ పంటకు ఈ క్రాప్ చేస్తున్నామని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. డీటీ యేసుపాదం మాట్లాడుతూ ఎన్నికలకు 28 గ్రామాల్లో 59 పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేశామన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన 2,260 మంది లబ్ధిదారులకు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లకు విద్యుత్ లైన్లు వేస్తున్నామని, 24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తామని తెలిపారు. వైద్యాధికారి బాలాజీ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, పీఆర్ ఏఈ శరాబందిరాజు, హౌసింగ్ ఏఈ భవానీ ప్రసాద్, ఏఓ రాజు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

పెనమలూరు: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో కంటి క్యాన్సర్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయ గంగూలి కపూర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం వివరాలు తెలుపుతూ ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కంటి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మూడేళ్ల లోపు పిల్లలకు సంభవించే రెటోనోబ్లాస్టోమా కంటి క్యాన్సర్‌తో కలిగే సమస్యలను వివరిస్తామన్నారు. ఈ క్యాన్సర్ అత్యంత ప్రాణాతంకమైనదని, పిల్లల దృష్టికి ప్రమాదకరమని చెప్పారు. కంటి క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవటంతో దేశంలో ఏటా 1,500 కొత్త కేసులు బయటపడుతున్నాయని, దాదాపు 50 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.

పరిశ్రమలతో భాగస్వామ్యం



జ్యోతి ప్రజ్వలన చేసిన పారిశ్రామికవేత్తలు

పెనమలూరు: శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్నందున ప్రముఖ పరిశ్రమలతో భాగస్వామ్య సదస్సు నిర్వహించామని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తెలిపారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సదస్సు నిర్వంచారు. ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ.. ఈ సదస్సు ద్వారా నైపుణ్యాభివృద్ధి, భాష ప్రావీణ్యం, సాంకేతికంగా కృత్రిమ మేధలో వస్తున్న మార్పులను విద్యార్థులకు వివరించామన్నారు. అకడమిక్ డైరెక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రముఖ బహుళ జాతీయ సంస్థలతో అనుసంధానం కావడంతో విద్యార్థులకు ఇంటర్న్ షిప్, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భారత్ బ్లాక్ చైన్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేశామని చెప్పారు. సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా శంకుస్థాపన ఏర్పాట్లు

కలెక్టర్ రాజాబాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

కోనేరుసెంటర్: మచిలీపట్నం నర్సింగ్ కళాశాల శంకుస్థాపన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలను శనివారం సందర్శించి శంకుస్థాపన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 5న భవన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. విశాలమైన వేదిక ఏర్పాటుచేసి, ఆకట్టుకునే అలంకరణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. వీడియో చిత్రీకరణ చేయాలని, వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని వీక్షించడానికి డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం ట్రయల్ నిర్వహించాలన్నారు. జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని చెప్పారు. తెలుగు సంప్రదాయం ప్రతిబింబించేలా స్వాగత నృత్యం ఉండాలని తెలిపారు. సమావేశంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిశీలకులు ధీరజ్ కుమార్, బందరు ఆర్డీవో ఎం.వాణి, నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వల్లీ, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశాలత, డీఎంఈ అధికారి డాక్టర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు' నిధులతో సీసీ రోడ్డు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు

లక్ష్మీపురం(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. లక్ష్మీపురం గ్రామ సచివాలయం–2 పరిధిలోని శివరామ దుర్గాపురం ఐదో వార్డులో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పూజలు చేసి ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.5 లక్షలతో దాదాపు 120 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, వార్డు సభ్యురాలు అబ్దుల్ సురాబీ, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్ మజీద్, నజీర్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యం పెంపునకు కృషి



క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మచిలీపట్నం జట్టు



షటిల్ పోటీల్లో విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుడివాడ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం



ఖో–ఖో పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్/మచిలీపట్నంటౌన్: క్రీడలు మానసిక స్థైర్యంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని గుడివాడ మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల ముగింపు అనంతరం శనివారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసి క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఖో–ఖో మహిళ, పురుషుల విభాగాల్లో జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాద్, ఏసురత్నం పాల్గొన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో ఏజీకే మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి మొదటి స్థానం కైవసం చేసుకోవడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పీఎల్ నర్సమాంబ తెలిపారు. పాఠశాలకు చెందిన ఎస్. వర్షిణి, హైని మేఘన పోటీలో విజయం సాధించారన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పురుషుల విభాగం క్రికెట్ పోటీల్లో మచిలీపట్నం జట్టు పెడన జట్టుపై విజయం సాధించి ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మచిలీపట్నం జట్టు 10 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసింది. పెడన 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 74 పరుగులు మాత్రమే చేయడంతో మచిలీపట్నం జట్టు గెలిచింది.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె



సత్యదుర్గ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు: ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఘనత చలమలశెట్టి సత్యదుర్గకు దక్కుతుందని గూడూరు మండల విద్యాశాఖ అధికారి బీఎస్సీ శేఖర్‌సింగ్ అన్నారు. మల్లవోలు జెడ్పీ హైస్కూలు ప్లస్ జూనియర్ కళాశాలలో పీజీటీగా చేస్తున్న చలమలశెట్టి సత్యదుర్గ పదవీ విరమణ సభ శనివారం హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సత్యదుర్గ, జేసీహెచ్ కేశవరావు దంపతులను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కాసాని అరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుడ్లవల్లేరు ఎంఈవో గోపాలరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పంచకర్ల నరసింహారావు, వైస్ చైర్మన్ గోవాడ ప్రశాంతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి పూర్ణిమ

గుడివాడ టౌన్: మహిళలకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎ. పూర్ణిమ అన్నారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్‌లోని అనంద్ ఫంక్షన్ హాల్లో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అంకిత ఆర్గనైజేషన్, స్వాతి ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా సాధికారితపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహ్మద్ రఫీ, సీహెచ్ కుటుంబరావు, డి.రాధాకృష్ణమూర్తి, స్వాతి ఆర్గనైజేషన్ అధికారి నవీన్ పాల్గొన్నారు.